క్లుప్తంగా

రేపు సాయి మందిర వార్షికోత్సవం

రాజంపేట టౌన్ : మండలంలోని కూచివారిపల్లిలో వెలసి ప్రసిద్ధిగాంచిన షిర్డీ సాయినాథ మందిరం ఏడవ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వేకవజాము నుంచే విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఉదయం 6 గంటలకు హారతి, 6:45కు అభిషేకం, విష్ణుసహస్రనామ పారాయణం, అనంతరం ప్రత్యేక పూజలు, సాయినాథ హోమం కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం మహాపూర్ణాహుతి కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అలానే సాయంత్రం 5 గంటలకు పల్లకి ఉత్సవం, 6 గంటలకు ధూపహారతి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు హరికుమార్‌శర్మ, శేఖర్‌శర్మ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. పూజల్లో భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

6న ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

సిద్దవటం : మండలంలోని జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి ఈనెల 6వ తేదీన సిద్దవటంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీపై ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఉపాధి ఏపీఓ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం ఆ శాఖ కార్యాలయంలో మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 1 ఏప్రిల్ 2023 నుంచి 30 మార్చి 2024 వరకు జరిగిన పనులపై నవంబర్ 29వ తేదీ నుంచి 05వ తేదీ వరకు 18వ విడత సామాజిక తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఈనెల 6న ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తామన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

12న సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని ఒంటిమిట్టలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఈనెల 12వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కేఈఆర్ఎం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి కోర్ సభ్యులు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

పెనగలూరులో మోస్తరు వర్షం


పెనగలూరులో కురుస్తున్న వర్షం

పెనగలూరు : మండలంలో బుధవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రానికి 10.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకంటే బుధవారం ఓ మోస్తరు ఎక్కువ వర్షం కురిసిందని మండల రైతాంగం చర్చించుకుంటున్నారు. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి ఒక చెరువు నిండకపోవడం, వాగులు, వంకలు పారకపోవడం విశేషం. ఏది ఏమైనా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఒంటిమిట్ట సీఐగా బాబు



ఒంటిమిట్ట : ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బుధవారం టి.బాబు బాధ్యతలు చేపట్టారు. ఈయన అన్నమయ్య జిల్లా వీఆర్ నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ కృష్ణంరాజు నాయక్ కడప వీఆర్‌కి బదిలీ అయ్యారు.

ఘనంగా ఘంటసాల జయంతి

రాయచోటి టౌన్ : పట్టణంలో గానగంధర్వుడు ఘంటసాల 102 జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో శ్రీ వెంకటేశ్వర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు తుమ్మల హరినాథ ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంగీతానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంగీత కళాకారులు చంద్రయ్య, కృష్ణయ్య, కళాకారులు రామాంజనేయులు, రాంబాబు, శ్రీరాములు, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్, రామచంద్ర, కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు ఓటుహక్కు కల్పించండి



పుల్లంపేట : ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నీటి సంఘాల ఎన్నికలు జరిపేందుకు నిర్ణయించిందని పాత ఓటర్ లిస్టులతో ప్రస్తుతం అర్హత ఉన్న రైతులు ఓటు హక్కు కోల్పోతారని వత్తలూరు ఉప సర్పంచ్ శంకర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం అర్హులైన రైతులకు ఓటు హక్కు కల్పించి ఓటర్ జాబితాలో చేర్చాలన్నారు. అలానే ఓటు వేసే విధానాన్ని రైతులకు తెలియజేయాలన్నారు.

గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- ఏ గ్రామంలోనూ కనిపించని డ్రైనేజీ వ్యవస్థ
- దోమల బెడద ఎక్కువైందంటున్న మండలవాసులు


ముగిరెడ్డిగారిపల్లెలో డ్రైనేజీ వ్యవస్థలేక గ్రామం మధ్యలో నిలిచిన మురుగునీరు

రామాపురం : గ్రామాలలో పారిశుద్ధ్యం పరిస్థితి కడు దయనీయంగా మారింది. పారిశుద్ధ్య వ్యవస్థ అమలుకై ప్రభుత్వం ఎన్నో రకాలుగా చర్యలు తీసుకుంటున్నా అమలు మాత్రం ప్రశ్నార్థకంగా తయారైంది. పేరుకే స్వర్ణ భారత్ అంటున్న గ్రామీణ ప్రాంతాలలో అది అందని ద్రాక్షలామారిందనే ఆరోపణలున్నాయి. మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా ఏ ఒక్క గ్రామాలలోనూ డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో వీధులలో మురికినీరు ప్రవాహంలా దర్శనమిస్తున్నాయి. దీని వల్ల దోమలు సంఖ్య పెరిగి అంటువ్యాధులకు కారణమవుతున్నాయి. మండలంలో గువ్వలచెరువు, నీలకంఠ్రావుపేట, గోపగుడిపల్లె, కసిరెడ్డిగారిపల్లె, కల్పనాయునిచెరువు, సుద్దమళ్ల, సరస్వతిపల్లె, రాచపల్లె, నల్లగుట్టపల్లె, బండపల్లె, హసనాపురం, చిట్లూరు, కుమ్మరపల్లె గ్రామాలలో ప్రతి ఏటా అంటు వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా లాంటి ఇతరాత్ర వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాలలో సిమెంటు రోడ్లకి ఇరువైపుల డ్రైనేజీల ఏర్పాటుకు సీసీ రోడ్లు నిర్మాణాల సమయంలో ఏర్పాటు చేసి ఉంటే శాశ్వత పరిష్కారంగా ఉండేదని గ్రామాలలో పలువురు పేర్కొంటున్నారు. మురికి నీరు, చెత్తాచెదారం కుప్పలుకుప్పలుగా గ్రామాలలో సాక్షాత్కరిస్తున్నాయి. ఏటా ఈ పారిశుద్ధ్యం నివారణకై లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నా అది కాగితపు లెక్కలకే పరిమితమవుతున్నాయి. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ కూడా సక్రమంగా లేక వేసవి కాలంలో నీరు వృథాగా రోడ్లపై పారుతుంటాయని గ్రామీణ ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. పల్లె ప్రాంతాలు ప్రగతికి పట్టుకొమ్మలు అని అనేవారు కాగా పల్లెలు ఎంతో ప్రగతి దిశగా అడుగులు వేయాల్సి ఉండగా నిధుల కొరతతో ప్రగతి పనుల అమలుకు విఘాతం ఏర్పడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా ఈ గ్రామసీమల ప్రగతికి చొరవ చూపాల్సి ఉందని గ్రామీణ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.


ఓబులరెడ్డిగారిపల్లెలో రామాపురంలో డ్రైనేజీ వ్యవస్థ లేక రోడ్లపై ఉన్న గుంతల్లో నిలిచిన మురుగునీరు

అంటువ్యాధులు ప్రబలే అవకాశం

అంటువ్యాధులు ప్రబలకుండా, పారిశుద్ధ్య పనులు చేపడితే దోమలు దరి చేరకుండా ఉంటాయి. గ్రామాలలో పారిశుద్ధ్యం నివారణకు విరివిగా నిధులు మంజూరు చేసి ఆచరణకు తోడ్పడాలి. పారిశుద్ధ్య పరిస్థితిలో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువ. ఇప్పటికే గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలకుండా తమ సిబ్బందితో చర్యలు, తగు జాగ్రత్తలు సూచించాం. ప్రజలు కూడా తమ చుట్టు పక్క ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– డాక్టర్ వినోద్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యాధికారి, రామాపురం

శాశ్వత ప్రయోజనాలు కల్పించాలి

గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ పడకేసింది. అధికారులు పట్టించుకోవడం లేదు. దోమల ఉధృతి చాలా పెరిగింది. అక్కడక్కడ జ్వర పీడితులు ఉన్నారు. ప్రభుత్వం శాశ్వత ప్రయోజనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలి. ప్రస్తుతం గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య పరిస్థితిని బాగుచేసి ప్రజారోగ్యానికి బాటలు వేయాలి. లేకుంటే అంటు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

– ఎస్.అర్షాద్ బాషా, నీలకంఠ్రావుపేట గ్రామం, రామాపురం

ర్యాలీలు, బంద్‌లకు అనుమతిలేదు


మాట్లాడుతున్న ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి

పెనగలూరు : మండలంలో ర్యాలీలు, బంద్‌లు పూర్తిగా నిషేధించామని ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని హిందూ, ముస్లింలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వారితో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న సంఘటనలకు వారికి సంఘీభావంగా మండలంలో ఎక్కడైనా ర్యాలీలు, బంద్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉండాలన్నారు. మండలంలో పోలీస్ 30యాక్టు అమలులో ఉంటుందన్నారు. అలాగే మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి బయటకు పంపించడం మంచి పద్ధతి కాదని తెలియజేశారు. ముఖ్యంగా వర్షాకాలం కావడంతో నదులు, వాగులు, వంకలు దగ్గరకు పిల్లలు పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలకు నందలూరు విద్యార్థి


ఓజస్వి గంగ

నందలూరు(రాజంపేట) : రాష్ట్రస్థాయి భగవద్గీత పోటీలకు శ్రీ అన్నమాచార్య అకాడమీ విద్యార్థి ఓజస్వి గంగ ఎంపికైంది. ఈ మేరకు కరస్పాండెంట్, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, డైరక్టరు మాడపూరి ప్రసాద్‌లు బుధవారం ఇక్కడి విలేకర్లకు తెలిపారు. శివదర్శన నంద స్పిరిచువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నెలరోజులు నుంచి వివిధ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీలలో ఓజస్వి గంగ ప్రతిభా పాటవాలు ప్రదర్శించి రాష్ట్రస్థాయికి చేరుకుందన్నారు. ఈనెల 11న గీతా జయంతి సందర్భంగా ప్రొద్దుటూరులో జరిగే పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు విద్యార్థిని అభినందించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

గాలివీడు : రెవెన్యూ సమస్యల పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ భాగ్యలత కోరారు. బుధవారం ఆమె మండలంలో డిసెంబర్ 6 నుంచి జనవరి 8 వరకు జరిగే రెవెన్యూ సదస్సుల సమాచారాన్ని విలేకరులకు తెలియజేశారు. ఇందులో 22ఏ, ఫ్రీహోల్డ్, భూ ఆక్రమణలు తదితర సమస్యలపై రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఫిర్యాదులు స్వీకరించి సమస్యను పరిష్కరిస్తారని తహసీల్దార్ తెలియజేశారు. గ్రామ సదస్సు వివరాలు.. ఈనెల 6న వెలిగల్లు, 10న అరవీడు, 12న తూముకుంట, 13న గాలివీడు 1, 2 సచివాలయాలు, 17న గాలివీడు–3 సచివాలయం, 18న గోరాన్ చెరువు, 19న నూలివీడు 19, 21న సీసీపల్లి, 24న పూలకుంట, పందికుంట గ్రామాలు, 26న కొర్లకుంట, తలముడిపిలలో, 28న గోపనపల్లి, ప్యారంపల్లి, జనవరి 3న గరుగుపల్లి, గుండ్లచెరువు, 7న ఎగువ గొట్టివీడు గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో డీటీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలను పరిష్కరిస్తామని మండల తహసీల్దార్ శ్రావణి బుధవారం తెలిపారు. గ్రామాల వారీగా సదస్సు వివరాలు.. ఈనెల 6,7వ తేదీలలో గడుకోట, ఎడబల్లె సచివాలయాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించబడునని, అలాగే 10, 11వ తేదీలలో వంగిమళ్ల గ్రామంలో, 13న దిగువరాచపల్లి పంచాయతీలో, 17, 18వ తేదీలలో సోమవరం పంచాయతీలో, 20న పెదవీడు, 21న సంగంవాండ్లపల్లి, 24న మట్లి, 26న తాటికుంట్ల, 28న వీరబల్లి, 31న గుర్రప్పగారిపల్లి, జనవరి 3న ఓదివీడు, 7న సానిపాయిలలో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. రైతులు, ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పింఛా నుంచి దిగువకు నీరు


దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

సుండుపల్లి : ఫెంగల్ తుపాను కారణంగా గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి మండల పరిధిలోని పింఛా ప్రాజెక్టుకు వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు నిండుకుండలా మారింది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కాగా చిన్నబిడికి – రాచపల్లి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ డీఈ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు.

డీసీసీ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోండి


అవగాహన కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి : ఏపీ కో–ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 2వ తేదీ నుండి 8వ తేదీ వరకు డీసీసీ బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, డిపాజిట్ల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీసీసీ బ్యాంక్ ఉద్యోగి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లి టౌన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీసీసీ బ్యాంకులో సీనియర్ సిటిజన్లకు 666 రోజులకు 8.35 శాతం వడ్డీ, సాధారణ ప్రజలకు 7.85 శాతం వడ్డీ ఇస్తుందని తెలిపారు. బంగారు ఆభరణాల, స్థిరాస్థి తాకట్టు, గ్రామీణ, పట్టణ గృహ నిర్మాణాలకు, చిరు వ్యాపారులకు వర్కింగ్ క్యాపిటల్ స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందిస్తున్నామని, వినియోగదారులు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కామ్రేడ్ వెంకటసుబ్బయ్య, రమణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ శోభారాణి

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని ఐసీడీఎస్ అసిస్టెంటు సీడీపీఓ శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు సలహాలు, సూచనలు తెలిపారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి


రైతులతో మాట్లాడుతున్న ఉపసంచాలకులు డాక్టర్ మాలకొండయ్య

రామాపురం : వర్షాలు పడుతున్నందునపశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాయచోటి పశువర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ మాలకొండయ్య అన్నారు. బుధవారం మండలంలోని సరస్వతిపల్లె గ్రామంలోని రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పశువుల్లో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యాధుల పట్ల పశువులు ఉన్న రైతులు ముందస్తుగా వ్యాధులకు సంబంధించి టీకాలు వేయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

7న స్కంద షష్టి

మదనపల్లె సిటీ : స్థానిక బెంగళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 7వతేదీన స్కంద షష్టి నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మెరుస్తున్న క్రిస్మస్ తారలు


కాంతులీనుతున్న క్రిస్మస్ స్టార్లు

కడప కల్చరల్ : క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. వారం రోజులుగా పాఠశాలల్లో ముందస్తు వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రార్థనా మందిరాలకు మరమ్మతులు చేపట్టి సున్నం, రంగులు వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. చర్చి కమిటీలు నిర్వహణ కమిటీలతో కలిసి పండుగ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. చర్చిల వద్ద, కూడళ్లలో క్రిస్మస్ స్టార్‌లను ఏర్పాటు చేశారు. రాత్రులు ఇవి శోభాయమానంగా వెలుగులీనుతూ పండుగ రాకను తెలియజేస్తున్నాయి.

పోస్టర్ ఆవిష్కరణ

కురబలకోట: మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయిలో నిర్వహించే అశ్వ ఫెస్టివల్–25కు సంబంధించి పోస్టర్, ప్రోమోను బుధవారం ఆవిష్కరించారు. కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయభాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో ఆవిష్కరణ నిర్వహించారు. ఫిబ్రవరి 21, 22న రెండు రోజుల పాటు సినీ తారలచే ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. విద్యార్థులకు టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ విభాగాలలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగే ఈపోటీలలో ఇంజినీరింగ్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు


వేంకటేశ్వరుడికి పూజలు చేస్తున్న స్వయం ప్రకాష్ సచ్చిదానంద స్వామి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం దివిక్షేత్రం హరహరిపురం కర్ణాటక స్వయం ప్రకాష్ సచ్చిదానంద స్వామివారు విచ్చేసి అభిషేకం, అర్చన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి విశేషంగా విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. ముందుగా కల్యాణ వేంకటేశ్వరస్వామి ధర్మకర్త కడియాల వెంకట సూర్యప్రకాష్, అర్చకులు హరి స్వామిలు స్వయం ప్రకాష్ సచ్చిదానంద స్వామివారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

ఘనంగా హరిహర తనయుడికి అంబలం పూజ


అయ్యప్పకు పూజలు చేస్తున్న ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, సునీత దంపతులు

రాజంపేట రూరల్ : శ్రీ అయ్యప్పస్వామికి బుధవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి సునీతలు అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లోని శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం పూజ కార్యక్రమం జరిపారు. పూజలో విఘ్నేశ్వరస్వామి, సుబ్రమణ్య స్వామి, అయ్యప్పస్వాములను ప్రత్యేక పూలతో అలంకరించి అంబలంలో కొలువుతీర్చి అభిషేకం, పూజలు చేశారు. తదనంతరం పడిపూజను చేపట్టి పాటలు పాడుతూ భజనలు చేశారు. ఇదే సమయంలో ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు చేసిన కోలాట ప్రదర్శన అలరించింది. తదుపరి భక్తులకు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి భిక్షను ఏర్పాటు చేశారు. పూజలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఆయన సతీమణి జ్యోతమ్మ, సోదరీమణులు గుడ్ల ఆశమ్మ, అనితమ్మ, వైస్ ఎంపీపీ ఆకేపాటి రంగారెడ్డి, గురుస్వాములు కొండా సత్యనారాయణ స్వామి, రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఐక్య కళావేదిక అధ్యక్షుడు జబ్బిరెడ్డి వెంకట్రామిరెడ్డి, వివిధ దేవతామూర్తుల దీక్షలు చేపట్టిన స్వాములు పాల్గొన్నారు.

ఎయిడెడ్ పోస్టుల నియామకాల్లో కుంభకోణం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలోని ఎయిడెడ్ పోస్టులు భర్తీలో భారీ కుంభకోణం జరిగిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రాహుల్, వీరపోగు రవి ఆరోపించారు. బుధవారం నగరంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా లోని ఆర్‌సీఎం పాఠశాలలోని ఖాళీలను రిక్రూట్ చేయడానికి దాదాపు 35 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. ఎంపిక విధానాన్ని మరియు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఒక్కో పోస్టుకు రూ.25 నుంచి రూ.30 లక్షల వరకు డబ్బులు వసూలు చేసి అమ్ముకున్నారని ఆరోపించారు.

వర్షం వస్తే రోడ్ల పరిస్థితి ఇలా..


రామాపురంలో కొద్దిపాటి వర్షానికే చెరువుని తలపిస్తున్న రోడ్డు మార్గం

రామాపురం : మండల కేంద్రంలో నిత్యం వందలాదిగా ప్రయాణం సాగించే ప్రాంతం. కానీ వర్షం వస్తే కనీసం నడవడానికి కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. రహదారులు, భవనాల శాఖల వారు నిత్యం ఈ మార్గంలో ప్రయాణాలను సాగిస్తున్నప్పటికీ కనీసం చీమకుట్టినట్లుగా కూడా లేదని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రధానంగా మూడు రోడ్ల కూడల నుంచి లక్కిరెడ్డిపల్లె వెళ్లే మార్గం మరీ అధ్వానంగా మారింది. ఇటీవల రాచపల్లి వరకు తారు రోడ్డును వేసి మమ అనిపించారు. మరో రెండు కిలోమీటర్లు రోడ్డు ఎలాంటి మరమ్మతులు చేయకుండా అలాగే వదిలేయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రాచపల్లి వద్ద నుండి మూడు రోడ్ల కూడలి వరకు రెండు వైపులా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పటికీ ఆచరణకు మాత్రం నోచుకోలేదు. డ్రైనేజీలకు కావాల్సిన స్థలం విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కూటమి ప్రభుత్వంలో ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పినప్పటికీ మండలంలో పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని స్థానికులు వాపోతున్నారు.

'లయన్స్' సేవలను ఆదర్శంగా తీసుకోవాలి


యాచకులకు దుప్పట్లను అందజేస్తున్న ఎస్‌ఐ, క్లబ్‌సభ్యులు

రాయచోటి అర్బన్ : ప్రజలకు లయన్స్ క్లబ్ సభ్యులు అందిస్తున్న సేవలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని రాయచోటి అర్బన్ ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో లయన్ కూనా విజయ కుమార్ ఆర్థిక సౌజన్యంతో కొనుగోలు చేసిన దుప్పట్లను పట్టణంలోని యాచకులకు పంపిణీ చేశారు. పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయం, సాయిబాబా ఆలయం, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండు, ప్రధాన రోడ్లలోని షాపుల ముందు భాగంలో నిద్రిస్తున్న యాచకులకు ఆయన లయన్స్ క్లబ్ సభ్యులతో కలసి దుప్పట్లను అందచేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జీఎంటీ కో–ఆర్డినేటర్ పి.యస్.హరినాథరెడ్డి, జోన్ ఛైర్మన్ మహమ్మద్, డిస్ట్రిక్ట్ ఛైర్మన్ హరీష్‌చంద్ర, కార్యదర్శి షేక్ ఇందాద్ అహమ్మద్, సభ్యుడు ప్రసాద్ ఆచారి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కల్గించవద్దు


వెంకటేశ్వర్లు, డీఎస్పీ, కడప

సిద్దవటం : గ్రామీణ ప్రాంతాల్లో ఎవరూ శాంతి భద్రతలకు భంగం కల్గించకూడదని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌కు బుధవారం డీఎస్పీ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న విషయానికి గొడవలు చేసుకుని కేసులు పెట్టుకుంటున్నారన్నారు. ప్రధానంగా సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో ఇసుక వల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తుతోందన్నారు. పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు బానిసలవ్వకుండా పోలీసు శాఖ తరపున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కోడిపందేలు, పేకాట స్థావరాలపై నిఘా ఉంచి ఆడేవారిపై ఆడించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ టి.బాబు, సిద్దవటం ఎస్‌ఐ చిరంజీవి, ఒంటిమిట్ట ఎస్‌ఐ, పోలీసులు పాల్గొన్నారు.

నాణ్యత లేకుంటే బిల్లులు ఆపేస్తాం

కలకడ : ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లేకుంటే బిల్లులు ఆపేస్తామని క్వాలిటీ కంట్రోల్ ఈఈ విజయభాస్కర్ తెలిపారు. బుధవారం మండలంలోని కె.దొడ్డిపల్లెలో 100 మీటర్లు, గోపాలపురంలో 50 మీటర్లు, కలకడలో 100 మీటర్ల మేర ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్లను పరిశీలించి క్వాలిటీ తనిఖీ చేశారు. నిధులకు కొదవలేదని సిమెంట్‌రోడ్లు మంజూరు చేసిన గ్రామాలలో వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

నీటిశుద్ధి లేదు..!


జ్యోతిగొల్లపల్లె ఎస్సీ కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న తాగునీటి ట్యాంకు

సిద్దవటం మండలంలోని జ్యోతిగొల్లపల్లె ఎస్సీ కాలనీలో తాగునీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రంగా ఉంది. ట్యాంకు నుంచి కలుషితమైన నీరు వస్తోందని బుధవారం స్థానికులు తెలియజేశారు. తాగునీటి ట్యాంకు వద్ద కలుషితమై ఉండటంతో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కాలనీలోని 70 గృహాలకు ఈ ట్యాంకు ద్వారా నీటి సరఫరా అవుతుందన్నారు. ఈ విషయమై ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి యాకూబ్‌ను విచారించగా శుక్రవారం అపరిశుభ్రంను తొలగించి కలుషితమైన నీరు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

– సిద్దవటం